అక్రమ నిర్మాణాలపై కొరడా


సుభాష్‌నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆధారం చేసుకుని టౌన్ ప్లానింగ్ అధికారి (ఏసీపీ) సాయిబాబా ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్నగర్ ప్రాంతంలో కూల్చివేతలు చేపట్టారు. అంజన్ కుమార్, మంజుల అనే పేర్లపై జీ ప్లస్ టు పర్మిషన్ తీసుకొని అదనపు అంతస్తు నిర్మించడంపై ఫిర్యాదు వచ్చింది. వారికి నోటీసు అందజేసి కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. ఉపకమిషనర్ నరసింహ, నాక్ సిబ్బంది పాల్గొని పై అంతస్తు మధ్యలో మెషిన్ సహాయంతో కట్ చేశారు.

◆ ఈ సందర్భంగా ఏసీపీ సాయిబాబా మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదన్నారు. ఫిర్యాదులు వచ్చిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి కూల్చివేతలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని వాటికి నోటీసులు జారీ చేసి దశలవారీగా కూల్చివేతలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి తప్ప.. అదనపు అంతస్తులు నిర్మిస్తే మాత్రం ఊరుకునే సమస్య లేదని స్పష్టం చేశారు.

యూపీహెచ్‌సీని తరలించొద్దు


మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు

సుభాష్‌నగర్: డివిజన్ పరిధిలోని సూరారం రాజీవ్‌గృహకల్పలో ఉన్న యూపీహెచ్‌సీని వేరే ప్రాంతానికి తరలించకుండా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డికి ఏఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూపీహెచ్‌సీ సెంటర్‌ను వేరే ప్రాంతానికి తరలిస్తే ఇబ్బందులు ఎదుర్కొంటామని తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ సెంటర్‌ను మార్చకుండా తనవంతు సహకారం అందిస్తామన్నారు. వెంటనే జిల్లా ఆరోగ్య శాఖ అధికారికి ఫోన్‌లో మాట్లాడి యూపీహెచ్‌సీని మార్చకుండా విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అందరితో మాట్లాడిన తర్వాతనే నిర్ణయం తీసుకొంటామని తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


డాక్టర్‌తో కలిసి మందులు పంపిణీ చేస్తున్న అంజన్‌గౌడ్

సుభాష్‌నగర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు పెద్దబాల్ అంజన్‌గౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన హెల్త్ మేళ ఉచిత శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి అనంతరం అంజన్‌గౌడ్ చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల మనమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



దుండిగల్: సైబరాబాద్ సీపీ, మేడ్చల్ డీసీపీల ఆదేశానుసారం మంగళవారం దుండిగల్ పోలీసులు బహదూర్‌పల్లిలోని టెక్ మహేంద్ర యూనివర్సిటీ సమీపంలోని దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు దుండిగల్ సీఐ శంకరయ్య తెలిపారు. గండిమైసమ్మ సమీపంలోని పలు హాస్టళ్లతో పాటు దుకాణాల్లో స్నైపర్ జాగిలాలతో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు శంకర్, రాజేష్, ఏఎస్సై లక్ష్మిరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


సూర్యానగర్‌కు వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభంపై ఒరిగిన చెట్టు


గిరినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఇలా..


సంజయ్‌గాంధీనగర్ రోడ్డు నెంబరు 4లో తీగలకు తాకుతున్న చెట్టు కొమ్మలు..

విద్యుత్ స్తంభాలకు అల్లుకుంటున్న తీగలు..

గాలొస్తే పోతున్న కరెంటు!

● స్తంభాలపై ఒరుగుతున్న చెట్ల కొమ్మలు ● విద్యుత్ సరఫరాలో నిత్యం అవంతరాలు ● ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు


గాంధీనగర్ రోడ్డులో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు


ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని కప్పేసిన తీగలు - విద్యుత్ తీగలకు దట్టంగా అల్లుకున్న దృశ్యం

రంగారెడ్డినగర్: విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు.. తీగలపై వేలాడుతున్న చెట్ల కొమ్మలతో తరచూ విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల విద్యుత్ ఏడీల పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో గత కొన్ని రోజులుగా విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ప్రధాన రోడ్ల వెంబడి తూతూమంత్రంగా కొమ్మలను తొలగించి అంతర్గత రోడ్లలో తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను వదిలేశారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలకు దట్టంగా అల్లుకున్న తీగలపై దృష్టి సారించలేదు. దీంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడ్డ ప్రతిసారి పలు గల్లీల్లో చెట్ల కొమ్మలు తీగలకు తాకడంతో ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదుల పరంపర కొనసాగినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్తంభాలపై చెట్లు ఒరిగినా...

◆ ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డు మార్గంలో చాలా ప్రాంతాల్లో స్తంభాలకు అల్లుకున్న తీగలు విద్యుత్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.. గత రెండు నెలలుగా చెట్లకొమ్మల తొలగింపు నెపంతో విద్యుత్ సరఫరాను నిలిపేసినా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు ఒరిగినా వాటిని తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గాలి వీచిన ప్రతి ట్రిప్ అవుతున్న కరెంట్..

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్ రోడ్ నం.4లో రావిచెట్టు కొమ్మలు తీగలకు తాకుతున్నాయి.ఇటీవల గాలులతో కురుస్తున్న వర్షాలతో తీగలు ట్రిప్ అయి సరఫరా నిలిపోతోంది.దీంతో ఈ గల్లీలోని సుమారు 30ఇళ్లగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు..



విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేశాం. ప్రజాప్రతినిధుల దృష్టికి సైతం తీసుకువెళ్లాం. ప్రజావాణిలో సైతం వినతులు అందజేశాం. అయినా చెట్ల కొమ్మలను తొలగించడం లేదు. వర్షం పడ్డ ప్రతిసారి విద్యుత్ సరఫరా నిలిపోతోంది. రాత్రి వేళల్లో చిమ్మ చీకట్లో గడపాల్సి వస్తోంది. చెట్ల కొమ్మలను తొలగించి ట్యూబ్ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

– వెంకట్‌ముదిరాజ్, జనరల్ సెక్రటరీ, సంజయ్‌గాంధీనగర్

పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం


పరిశ్రమ నుండి వెలువడుతున్న పొగలు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జీడిమెట్లలోని ఓ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల, మేడ్చల్ జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన వెంకటపతిరాజు పైప్‌లైన్‌రోడ్డులోని ఐడీఏ జీడిమెట్లలో శ్రీలక్ష్మి ఇండస్ట్రీస్ పేరిట రోగ్యులకు అందజేసే సప్లిమెంట్ (పౌష్టిక అహారం) తయారు చేసే పరిశ్రమను నడుపుతున్నాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి పరిశ్రమను సిబ్బంది మూసివేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో పరిశ్రమ నుండి పొగలు రావడాన్ని స్థానికంగా ఉండే ఓ వ్యక్తి గమనించి పరిశ్రమ యజమానికి సమాచారం అందించాడు. వెంటనే వారు జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే కాస ఆలస్యం కావడంతో పరిశ్రమ లోపల మంటలు తీవ్రంగా చెలరేగి పక్క పరిశ్రమలోకి పాకాయి. జీడిమెట్ల ఫైర్ సిబ్బంది స్థానికుల సహాయంతో పరిశ్రమ షట్టర్‌ను తొలగించి కూకట్‌పల్లి నుండి మరో ఫైర్ ఇంజన్‌ను తెప్పించారు. ఫోమ్ డబ్బాలతో పరిశ్రమ చుట్టు తిరుగుతూ ఒక గంటపాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. పరిశ్రమ లోపల ఉన్న ముడిసరుకు, ప్లాస్టిక్ బకెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనాస్థలంలో డీఎఫ్ఓ గిరిధర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఏడీఎఫ్ఓ, పేట్ బషీరాబాద్ ఎస్సైలు, కానిస్టేబుళ్లు, మంటలు అదుపులోకి వచ్చే వరకు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢమాస పూజలు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ఆషాఢమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ధన్‌రాజ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

తొలగించిన నాలా ఫెన్సింగ్‌ను మళ్లీ ఏర్పాటు చేయాలి

చింతల్: మరమ్మతుల కోసం తొలగించిన ఫెన్సింగ్ మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో అటుగా వెళ్లే చిన్నారులు, వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ నుండి దుర్గయ్య నగర్ మీదుగా వెళ్లే ఈ నాలాకు స్టార్ లైట్ అపార్ట్‌మెంట్స్ వెనకాల ఇటీవల రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీనికి ఇటీవల జీహెచ్‌ఎంసి ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో నాలాకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ జాలిని తొలగించారు. గోడ పునర్నిర్మాణం చేపట్టిన సదరు కాంట్రాక్టర్ మరల ఫెన్సింగ్ జాలిని ఏర్పాటు చేయడం గాలికి వదిలేశాడు. దీంతో భగత్‌సింగ్‌నగర్‌కు వెళ్లే దారిలోనే ఈ నాలా ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు చిన్నారులు, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ నాల పక్కన ఖాళీ స్థలం ఉండడంతో తాగుబోతులు సైతం అటువైపు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ గోడ నిర్మాణ సమయంలో నాసిరకంగా మరమ్మతులు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గోడ నిర్మాణం పూర్తయిన తర్వాత క్యూరింగ్ కోసం ఒక్క చుక్క నీటిని కూడా పోయలేదని స్థానికులు ఆరోపిస్తుండటంతో ఈ గోడ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్మికుల హక్కులను కాపాడేది ఏఐటీయూసీయే


మాట్లాడుతున్న ఎండీ యూసూఫ్

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కులను కాపాడేది ఏఐటీయూసీ మాత్రమేనని ఈ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ అన్నారు. మంగళవారం షాపూర్ నగర్‌లోని పాట్లూరి నాగేశ్వరరావు భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం మాటాడుతూ... భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి హక్కుల సాధనకు ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు.

◆ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.25వేలు అమలు చేయాలన్నారు. రాత్రి వేళల్లో మహిళలకు డ్యూటీలు వేయవద్దన్నారు. ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ.15వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు, క్యాబ్ డ్రైవర్లకు లేబర్ కమిషన్ నుంచి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా సమితి కార్యదర్శి శ్రీనివాస్, రాములు, రవి చందర్, హరినాథ్ రావు, మహేందర్, ఆటో యునియన్ నాయకులు రమేష్, మహేందర్, శ్రీనివాసులు, తులసి, వెంకటరమణ, శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యార్థి దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 76వ జాతీయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు ప్రొ.మీసాల ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఎగురవేశారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మృతుడి వివరాలు లభించలేదు: పోలీసులు



దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బౌరంపేట్‌లోని ఓం సాయిరామ్ ఫిల్లింగ్ పెట్రోల్ బంక్ సమీపంలోని చెట్టుకు మంగళవారం ఓ వ్యక్తి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35–40ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి వివరాలు తెలియ రాలేదని పేర్కొన్నారు. ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


బీనా రియాజ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి గార్డెన్ సొసైటీకి చెందిన రియాజ్, బీనా రియాజ్ సన్మానీ(33)లు భార్యాభర్తలు. బ్యూటీషియన్‌గా పనిచేసే బీనా కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. కాగా మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆమెకు కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, కొత్త ఎల్‌సీ లైన్ ఏర్పాటు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రశాంత్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బృందావన్ హిల్స్, సైదప్ప బస్తీ. అదే విధంగా వజ్రా నిర్మాణ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ లైన్ల బైఫరీకేషన్ పనుల నేపథ్యంలో జర్నలిస్ట్‌కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడి

జీవితాలు నాశనం చేసుకోవద్దు



డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


హాజరైన విద్యార్థులు, ఫ్యాకల్టీ

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మంగళవారం బాచుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తే సమాచారం అందజేయాలన్నారు. అదే విధంగా విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాచుపల్లి పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరికి చెరువు కబ్జాలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో చోటు చేసుకుంటున్న కబ్జాల విషయమై మంగళవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్, మూసాపేట్ మండలాల పరిధిలోని సర్వే నం.348/1లో ఉన్న పరికి చెరువు శిఖం భూమి, హిందూ శ్మశానవాటికలను కబ్జా చేసి కొందరు వ్యక్తులు ప్లాట్లు చేశారు. వాటిని అమాయక ప్రజలకు కట్టబట్టేందుకు యత్నిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని శ్రీశైలంగౌడ్ అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డి సంబంధిత రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి చెరువు స్థలాన్ని, శ్మశానవాటికలను పరిరక్షిస్తామని, కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, మాజీ మున్సిల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణాగౌడ్, రషీద్ తదితరులు ఉన్నారు.


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ తదితరులు

బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలి

సాక్షి ఎఫెక్ట్..

● నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి ● హెచ్‌ఎండీఏ అధికారులతో పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బాచుపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ఏడాదిన్నర క్రితం ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమయాల్లో కిలోమీటర్ మేర వాహనాల రద్దీ కొనసాగుతోంది. దీంతో కళాశాలలు, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

◆ ఈ విషయమై 'సాక్షి'లో 'ఫ్లైఓవర్ పనులు.. జాప్యమెందుకు?'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. మంగళవారం నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి, హెచ్ఎండీఏ అధికారులు ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన మేయర్ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. మేయర్ వెంట సర్కిల్ కమిషనర్ రామకృష్ణరావు తదితరులు ఉన్నారు.